


EVENING EDITION
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
సోమవారం
23-03-2026
పేజీలు: 02




## దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు

బీఆర్ఎస్ తరఫున గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ ఫిరాయింపు వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆయనపై అనర్హత వేటు వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టిన ధర్మాసనం.. దానం నాగేందర్‌కు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా ఈ నోటీసులపై వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. గతంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, దానం నాగేందర్ పార్టీ మారలేదని ఇచ్చిన తీర్పును ఆయన తన పిటిషన్‌లో సవాల్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన దానం, ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 'బి-ఫామ్'పై పోటీ చేశారని, ఇది పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కిందకు వస్తుందని మహేశ్వర్ రెడ్డి వాదించారు. ఈ నేపథ్యంలో స్పీకర్ తీర్పును రద్దు చేసి, దానంపై అనర్హత వేటు వేయాలని కోర్టును అభ్యర్థించారు.


### ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంపై పార్లమెంటులో

# ప్రధాని మోదీ ప్రసంగం

ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో, భారత ప్రధాని నరేంద్ర మోదీ నేడు లోక్‌సభలో కీలక ప్రసంగం చేయనున్నారు. ఈ సంక్షోభం వల్ల భారత్‌పై పడే ప్రభావం, దౌత్యపరమైన వ్యూహాలు, భారత పౌరుల భద్రతపై ఆయన స్పష్టత ఇవ్వనున్నారు. ముడి చమురు ధరల పెరుగుదల, సరఫరాపై ప్రధాని ప్రకటన చేసే అవకాశం ఉంది. శాంతి పునరుద్ధరణకు భారత్ చేస్తున్న కృషి గురించి కూడా ప్రధాని పార్లమెంట్ కు వివరించబోతున్నారు. గత కొద్ది రోజులుగా ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న దాడుల వల్ల ప్రపంచ శాంతికి విఘాతం కలుగుతోందని భారత్ ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులు, ప్రతిచర్యగా ఇరాన్ క్షిపణి ప్రయోగాలు పశ్చిమాసియాను మునుపెన్నడూ లేని విధంగా అస్థిరపరిచాయి. యుద్ధం వల్ల ఎవరూ గెలవరని, కేవలం చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యమని ప్రధాని పునరుద్ఘాటించే అవకాశం ఉంది. గల్ఫ్ దేశాలలో నివసిస్తున్న లక్షలాది మంది భారతీయుల భద్రతపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయన



వివరించనున్నారు. ముడి చమురు ధరల పెరుగుదల, సరఫరా గొలుసులో తలెత్తే అంతరాయాలను ఎదుర్కోవడానికి భారత్ సిద్ధంగా ఉందని ప్రధాని భరోసా ఇవ్వనున్నారు. యుద్ధ బాధితులకు మానవీయ సహాయం అందించే విషయంలో భారత్ తన బాధ్యతను నెరవేరుస్తుందని ప్రధాని స్పష్టం చేయనున్నారు. మరోవైపు, విపక్షాలు చమురు ధరలు పెరిగితే సామాన్యుడిపై పడే భారం గురించి ప్రభుత్వం నుండి స్పష్టత కోరుతున్నాయి. దీనిపై ప్రధాని తన ప్రసంగంలో సమాధానమిచ్చే అవకాశం ఉంది. ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా, గ్లోబల్ సౌత్ దేశాలకు ప్రతినిధిగా, ఈ సంక్షోభాన్ని పరిష్కరించడంలో భారత్ ఎటువంటి మధ్యవర్తిత్వం వహించబోతోందనేది అంతర్జాతీయంగా ఆసక్తి రేకెత్తిస్తోంది. పశ్చిమాసియాలో శాంతి పునరుద్ధరణకు భారత్ తన వంతు కృషి చేస్తుందని ప్రధాని మోదీ తన ప్రసంగం ద్వారా ప్రపంచ దేశాలకు సందేశం ఇచ్చే అవకాశం ఉంది.



## హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు.. రంగంలోకి జపాన్ సైన్యం?

ప్రపంచ దేశాలకు చమురు సరఫరా చేసే కీలకమైన 'హర్మూజ్ జలసంధి'లో నెలకొన్న ఉద్రిక్తతలు జపాన్‌ను కలవరపెడుతున్నాయి. అమెరికా-ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం నేపథ్యంలో సముద్ర మార్గంలో నౌకా దళ మైన్లు జపాన్‌కు ఆటంకం కలిగిస్తున్నాయి. తమ దేశ మనుగడకు అత్యవసరమైన చమురు సరఫరాను పునరుద్ధరించేందుకు సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఎస్‌డీఎఫ్)ను రంగంలోకి దించే అంశాన్ని జపాన్ పరిశీలిస్తోంది. జపాన్ రాజ్యాంగం ప్రకారం విదేశాల్లో సైనిక బలగాలను మోహరించడంపై ఆంక్షలు ఉన్నప్పటికీ, దేశ మనుగడకు ముప్పు వాటిల్లితే సైన్యాన్ని పంపే వెసులుబాటు ఉంది.

## మహిళలకు V. C. Sajjanar హెచ్చరిక

స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరగడం, సోషల్ మీడియా విస్తరణతో యువతులు సైబర్ మోసాలకు గురయ్యే ప్రమాదం ఎక్కువవుతోందని V. C. Sajjanar హెచ్చరించారు.నకిలీ ఆన్‌లైన్ గుర్తింపులతో పరిచయాలు పెంచుకుని, యువతులను మోసం చేసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్నాయని ఆయన తెలిపారు. ముఖ్యంగా మహిళలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు.Facebook, Instagram వంటి వేదికల్లో ఆకర్షణీయమైన ఫోటోలు, సినీ నటుల చిత్రాలతో నకిలీ ఖాతాలు సృష్టించి ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపుతున్నారని వెల్లడించారు. పరిచయం ఏర్పడిన తర్వాత వ్యక్తిగత ఫోటోలు, వీడియోలు పంపించేలా ప్రలోభపెట్టి, వాటిని ఆధారంగా తీసుకుని బాధితులను బెదిరిస్తున్నారని చెప్పారు. ఒకసారి వ్యక్తిగత సమాచారం చేతికి చిక్కిన వెంటనే డబ్బులు డిమాండ్ చేయడం, ఫోటోలను మార్పులు చేసి మరింత ఒత్తిడి తేవడం వంటి చర్యలకు దిగుతున్నారని తెలిపారు. సమాజంలో పరువు పోతుందనే భయంతో చాలా మంది బాధితులు కుటుంబ సభ్యులకు చెప్పకుండా మౌనంగా ఉండిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కారణంగా పలువురు మహిళలు మానసికంగా తీవ్రంగా నలిగిపోతున్నారని, కొన్ని విషాదకర ఘటనలు కూడా చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు.ఇలాంటి పరిస్థితులు ఎదురైతే భయపడకుండా వెంటనే కుటుంబ సభ్యులకు తెలియజేయాలని, లేకపోతే పోలీసులను సంప్రదించాలని V. C. Sajjanar సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 100కు కాల్ చేయాలని తెలిపారు. బాధితులకు పూర్తి సహాయం



అందిస్తామని భరోసా ఇచ్చారు.పిల్లలతో సమయం గడుపుతూ వారి ఆన్‌లైన్ కార్యకలాపాలపై తల్లిదండ్రులు నిఘా పెట్టాలని సూచించారు. నకిలీ ప్రొఫైల్‌లు, నంబర్లు, VPNలు ఉపయోగించినా నిందితులు తప్పించుకోలేరని హెచ్చరించారు. "ఎక్కడ ఉన్నా నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటాం'' అని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో అపరిచితులతో పరిచయాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ఏ సమస్య వచ్చినా ధైర్యంగా ముందుకు రావాలని మహిళలకు హైదరాబాద్ నగర పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## కనీస వేతనం చెల్లించాలని కలెక్టరేట్ ఎదుట ఆశ వర్కర్ల ధర్నా

ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18,000 చెల్లించాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనం 18000 చెల్లించాలని ,కేంద్ర ప్రభుత్వం ఇస్తానన్న రూ.1500 తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేయాలన్నారు. చాలీ చాలని జీతాలతో వెట్టి చాకిరి చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.




కార్యక్రమంలో సంఘం నాయకురాలు జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.



## హాట్ లుక్స్‌తో దిశా పటాని

తెలుగులో ఎంతో మంది ముద్దుగుమ్మలు తమ అందచందాలతో, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కానీ ఆతర్వాత టాలీవుడ్ కు దూరం అయ్యారు. తెలుగులో కొన్ని సినిమాలే చేసి ఆ తర్వాత బాలీవుడ్ కు చెక్కేసినవారు చాలా మంది ఉన్నారు. కొంతమంది ముద్దుగుమ్మలు ఒకటి రెండు సినిమాలతోనే పరిమితం అవుతున్నారు. పెళ్లి చేసుకొనో.. లేక అవకాశాలు లేక సినిమాలకు దూరం అయ్యారు. ఒక ముద్దుగుమ్మ తెలుగులో రెండే సినిమాలు చేసింది. అందులో ఒకటి డిజాస్టర్ కాగా ఓ సినిమా సంచలన విజయం సాధించింది. కానీ ఈ బ్యూటీకి ఆఫర్స్ మాత్రం లేదు. ఇప్పుడు ఒకొక్క సినిమాకు రూ. 3 కోట్లు వసూల్ చేస్తుంది ఈ చిన్నది. అలాగే ఆమె ఆస్తి పాస్తులు కూడా కోట్లల్లో ఉన్నాయి.

## ఇక నుంచి 10 కేజీల ఎల్పీజీ సిలిండర్?



పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఎల్‌పీజీ గ్యాస్ కొరత నెలకొంది. ఈ పరిస్థితుల్లో గృహ వినియోగదారులకు సరఫరాలో అంతరాయం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వ రంగ ఆయిల్ సంస్థలు దృష్టి సారించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇకపై గృహ వినియోగదారులకు 10 కేజీల ఎల్‌పీజీ గ్యాస్‌తో సిలిండర్‌లను సరఫరా చేసే అంశాన్ని ఆయిల్ సంస్థలు పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. తద్వారా సరఫరాలో ఆటంకాలు రాకుండా ప్రస్తుత నిల్వలను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని సంస్థలు భావిస్తున్నాయి. ప్రస్తుతం 14.2 కేజీల సిలిండర్‌లు సరఫరా అవుతున్న విషయం తెలిసిందే. ఇకపై ఈ సిలిండర్‌లలో 10 కేజీల గ్యాస్ నింపి సరఫరా చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇందు కోసం ప్రభుత్వ అనుమతుల అవసరం. గ్యాస్ బాట్లింగ్ ప్లాంట్‌ల వ్యవస్థల్లో కూడా ఈ మేరకు మార్పులు చేయాల్సి ఉంటుందని తెలుస్తోంది. వచ్చే నెలలో గ్యాస్ కొరత మరింత పెరిగే అవకాశం ఉందని కూడా ప్రభుత్వ రంగ సంస్థలు భావిస్తున్నట్టు సమాచారం. అయితే, ఈ వార్తలపై కేంద్ర ప్రభుత్వం ఇంకా స్పందించాల్సి ఉంది. ఇక గత వారం ఎల్‌పీజీ గ్యాస్‌తో రెండు నౌకలు గల్ఫ్ నుంచి భారత్‌కు చేరుకున్నాయి. వీటిల్లో మొత్తం 92,700 టన్నుల ఎల్‌పీజీ సరఫరా అయ్యింది. ప్రస్తుత పరిస్థితుల్లో పొదుపు చర్యలు అవసరమని పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రెటరీ సుజాత శర్మ ఇటీవల మీడియా సమావేశంలో అభిప్రాయపడిన విషయం తెలిసిందే.




## ఏప్రిల్ 1 నుంచి పాన్ కార్డు రూల్స్‌లో మార్పులు

ఏప్రిల్ 1వ తేదీ నుంచి పాన్ కార్డు దరఖాస్తు నిబంధనలలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. ప్రస్తుతం ఆధార్ కార్డుతో పాన్ కార్డు పొందడం సులభంగా ఉన్నప్పటికీ, మార్చి 31 తర్వాత దరఖాస్తు చేసుకునేవారు ఆధార్‌తో పాటు డేట్ ఆఫ్ బర్త్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి అదనపు గుర్తింపు ధృవీకరణ పత్రాలను తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. ఈ-పాన్ డౌన్‌లోడ్ పేరుతో జరుగుతున్న మోసాలపై పోలీసులు అప్రమత్తం చేశారు. స్పామ్ లింక్‌లను క్లిక్ చేయవద్దని, ఐటీ డిపార్ట్‌మెంట్ అలాంటి సందేశాలు పంపదని సూచించారు.




## జమ్ముకశ్మీర్‌లో ఎన్ఐఏ సోదాలు

దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన పేలుడు కేసులో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ దర్యాప్తు జరుపుతోంది. దర్యాప్తులో భాగంగా జమ్ముకశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో ఎన్ఐఏ ఇవాళ సోదాలు నిర్వహిస్తోంది. ఇందుకోసం సోమవా రం తెల్లవారుజాము నుంచి తనిఖీలు చేపట్టింది. హంద్వారా లోని ఓ వ్యాపారి నివాసంలో ఎన్ఐఏ అధికారులు సోదాలు చేశారు. ఈ కేసులో అరెస్టైన వైద్యులకు ఆయుధాలు సరఫరా చేసిన వ్యక్తులతో ఆ వ్యాపారికి సంబంధం ఉన్నట్లు గుర్తించామనని అధికారులు తెలిపారు. ఇప్పటికే పలు కీలక పత్రాలతోపాటు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.



## రైలు కిందపడి ఇద్దరు స్నేహితులు ఆత్మహత్య

ఏపీలో తిరుపతి దారుణం జరిగింది. ఇద్దరు స్నేహితులు ఆత్మహత్య చేసుకోవడం కలకలం సృష్టించింది. జిల్లాలోని తడ మండలం కొండూరు వద్ద రైలు కిందపడి మృతి చెందారు. మృతులు పేర్నాడుకు చెందిన సునీల్, పిండిపాలేనికి చెందిన కల్యాణ్‌గా పోలీసులు గుర్తించారు . మృతుల బంధువులకు సమాచారం అందజేసిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## కోలీవుడ్‌లోకి రోజా రీఎంట్రీ

తమిళ సినీ పరిశ్రమలో సీనియర్ నటీమణుల రీఎంట్రీ ట్రెండ్ కొనసాగుతోంది. ఇటీవల శోభన తిరిగి కోలీవుడ్‌లోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో, ఇప్పుడు మరో ఫైర్‌బ్రాండ్ నటి, రాజకీయ నాయకురాలు ఆర్కే రోజా కూడా మళ్లీ తమిళ సినిమాల్లో బిజీ అవుతున్నారు. గత కొంతకాలంగా ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చురుకుగా ఉన్న రోజా, ప్రస్తుతం సినిమాలపై మళ్లీ ఫోకస్ పెట్టారు. 12 ఏళ్ల విరామం తర్వాత ఆమె తమిళ ఇండస్ట్రీలోకి రీఎంట్రీ ఇస్తుండటం విశేషం. ఇప్పటికే ఆమె నటించిన లెనిన్ పాండ్యన్ షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది.ఇదే సమయంలో రోజా నటిస్తున్న మరో చిత్రం అన్బే డయానా కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. పారి ఎలవళగన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో రమ్య రంగనాథన్ హీరోయిన్‌గా కనిపించనున్నారు. చెన్నైలోని పెరంబూర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ రొమాంటిక్ లవ్ స్టోరీలో రోజా కీలక పాత్రలో, ముఖ్యంగా హీరో తల్లి పాత్రలో కనిపించబోతున్నారు.



## సౌదీలోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు

సౌదీ అరేబియా, బహ్రెయిన్‌లలోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసినట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్ జీసీ) సోమవారం ఉదయం ప్రకటించింది. ఈ పరిణామంతో గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్, బహ్రెయిన్‌లోని అమెరికా ఫిఫ్త్ ఫ్లీట్ ప్రధాన కార్యాలయం లక్ష్యంగా ఈ దాడులు జరిపినట్లు ఐఆర్ జీసీ ప్రతినిధి తెలిపారు. అమెరికా నిఘా విమానాలు ఈ స్థావరాల నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నందున వాటిని లక్ష్యంగా చేసుకున్నామని చెప్పారు. ఈ దాడుల్లో అమెరికాకు చెందిన ఐదు కేసీ-135 స్ట్రాటోట్యాంకర్ విమానాలు దెబ్బతిన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. మరోవైపు, సౌదీ అరేబియా తమ దేశంపైకి వస్తున్న ఇరాన్ ఆయుధాలను అడ్డుకుంది. రియాద్, తూర్పు ప్రాంతం లక్ష్యంగా వచ్చిన రెండు డ్రోన్లు, ఒక బాలిస్టిక్ క్షిపణిని తమ వాయు రక్షణ వ్యవస్థలు కూల్చివేసినట్లు సౌదీ రక్షణ శాఖ ప్రకటించింది. ఇదే సమయంలో ఇజ్రాయెల్ వైమానిక దళం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని మౌలిక సదుపాయాలపై కొత్తగా బాంబు దాడులు మొదలుపెట్టింది. తమ లక్ష్యాలను సాధించే దిశగా యుద్ధం సరైన మార్గంలోనే సాగుతోందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు వ్యాఖ్యానించారు.

## ఈటెల రాజేందర్ ఫైర్



బీజేపీ రాష్ట్ర నాయకత్వంపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికను రాష్ట్ర నాయకత్వం నిర్ణయించడం మానేయాలని సూచించారు. తమ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అభ్యర్థులను తామే బరిలోకి దించుతామని స్పష్టం చేశారు. రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి నేను ఇప్పటికే సర్వేలు చేశాం.. మా అభ్యర్థులను మేమే నిర్ణయిస్తామని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. ఇటీవల డివిజన్ అధ్యక్షుల ఎంపిక కోసం వేసిన అబ్జర్వర్ల జాబితా విషయంలో తనకు ఇప్పటికీ సమాచారం ఇవ్వలేదని తెలిపారు. పార్టీ నిర్ణయాల్లో నాకు కనీసం సమాచారం అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్ నేతగా తనకు ఒక గుర్తింపు ఉందని.. బీజేపీ దాన్ని కాపాడుకోవాలని ఈటల రాజేందర్ సూచించారు. సోషల్ మీడియాలో నాపై వస్తున్న నెగెటివ్ కామెంట్స్ వెనకాల బీజేపీ పార్టీ నేతలే ఉన్నారని తెలిపారు. సొంత పార్టీ నేతలే నాపై నెగెటివ్ క్యాంపెయిన్ చేయించడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుల ముందే ఈటల రాజేందర్ ఇలా ఆగ్రహం వ్యక్తం చేయడం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారింది.





# తల్లి శవం పక్కన రాత్రంతా రెండేళ్ల చిన్నారి

అమ్మ ఎంత పిలిచినా పలకడం లేదు. రాత్రంతా చలిలో, చీకట్లో ఆ పసి ప్రాణం ఆమెను లేపేందుకు ప్రయత్నించింది. ఆకలితో, భయంతో చేసిన రోదన అరణ్య రోదనగానే మిగిలింది. రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం రంగారెడ్డిగూడ శివారులో జరిగిన ఈ హృదయ విదారక ఘటన ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తోంది. ఓ మహిళను దుండగులు అత్యంత కిరాతకంగా హత్య చేయగా, ఆమె రెండేళ్ల చిన్నారి మాత్రం రాత్రంతా ఆ మృతదేహం పక్కనే ఏడుస్తూ ఉండిపోయింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. రంగారెడ్డిగూడకు చెందిన శోభకు పదేళ్ల క్రితం మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండకు చెందిన వ్యక్తితో వివాహమైంది. వీరికి ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. మనస్పర్థల కారణంగా మూడేళ్ల క్రితం భర్త నుంచి విడిపోయిన ఆమె, ఆ తర్వాత కోయిలకొండకే చెందిన నర్సింహులు అనే వ్యక్తితో సహజీవనం చేయడం ప్రారంభించింది. వీరికి రెండున్నరేళ్ల కుమార్తె ఉంది. అయితే, కొంతకాలంగా నర్సింహులుతో కూడా శోభకు గొడవలు జరుగుతుండటంతో ఆమె పుట్టింటికి వచ్చేసి తల్లితో కలిసి ఉంటోంది. ఈ క్రమంలో శనివారం నర్సింహులు ఆమెకు ఫోన్ చేసి, కుమారుడికి సైకిల్ ఇప్పిస్తానని షాద్‌నగర్‌కు రమ్మని పిలిచాడు. కొడుకును తీసుకుని ఆమె షాద్‌నగర్ వెళ్లగా, ఎంతసేపటికీ అతను రాలేదు. దీంతో ఆమె తిరిగి ఇంటికి వెళ్లిపోయింది. ఆ తర్వాత కుమారుడిని తల్లి వద్ద ఉంచి, తన రెండున్నరేళ్ల కుమార్తెతో కలిసి మళ్లీ బయటకు వెళ్లింది. ఆదివారం తెల్లవారుజామున గ్రామ శివారులోని ఓ పంట పొలంలో శోభ రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉంది. ఆమె తలపై బండరాయితో మోది హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. శనివారం రాత్రి ఈ దారుణం జరగ్గా, ఆ రాత్రంతా చిన్నారి తన తల్లి శవం పక్కనే ఏడుస్తూ ఉండిపోయింది. ఆదివారం ఉదయం అటుగా వెళ్తున్న గ్రామస్థులు చిన్నారి ఏడుపు విని, దగ్గరకు వెళ్లి చూడగా ఈ ఘోరం వెలుగులోకి వచ్చింది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి తల్లి కరుణమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శోభతో సహజీవనం చేస్తున్న నర్సింహులుపైనే అనుమానం వ్యక్తం చేస్తూ అతడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# భారత్‌కు భారీ ఊరట



పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రస్థాయికి చేరినప్పటికీ భారత్‌కు ఇంధన సరఫరా విషయంలో పెద్ద ఊరట లభించింది. సుమారు 92,700 మెట్రిక్ టన్నుల వంటగ్యాస్‌తో వస్తున్న రెండు భారీ భారతీయ నౌకలు 'పైన్ గ్యాస్', 'జగ్ వసంత్' హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటాయి. ఈ నౌకలు ప్రస్తుతం గుజరాత్‌లోని ముంద్రా, కాండ్లా రేవుల వైపు ప్రయాణిస్తున్నాయి. భారత్‌తో ఉన్న బలమైన దౌత్య సంబంధాల కారణంగా ఇరాన్ ఈ నౌకలకు ప్రత్యేక అనుమతి ఇవ్వడం విశేషం. ఇరాన్ నౌకాదళం ఈ నౌకలకు మార్గనిర్దేశం చేసి భద్రత కల్పించింది. యుద్ధ వాతావరణం నెలకొన్న గల్ఫ్ ప్రాంతంలో భారత ఇంధన భద్రతకు ఇది కీలక పరిణామంగా నిపుణులు భావిస్తున్నారు. మరోవైపు, దేశంలో ఇంధన ధరల విషయానికి వస్తే, అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధర బ్యారెల్‌కు 110 డాలర్లు దాటినా, కేంద్ర ప్రభుత్వం సామాన్యులపై భారం పడకుండా పెట్రోల్, డీజిల్ ధరలను స్థిరంగా ఉంచింది. అయితే, వాణిజ్య అవసరాలకు వాడే బల్క్ డీజిల్ ధరను లీటరుకు రూ.22 వరకు, ప్రీమియం పెట్రోల్ ధరను రూ.2 వరకు పెంచింది. ఈ నిర్ణయం రవాణా, తయారీ రంగాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రస్తుతం దేశంలో 15 నుంచి 20 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని, ప్రజలు ఆందోళనతో గ్యాస్ సిలిండర్లను ముందస్తుగా బుక్ చేసుకోవద్దని కేంద్ర పెట్రోలియం శాఖ సూచించింది. అమెరికా వంటి దేశాల నుంచి ఎల్‌పీజీ దిగుమతులను పెంచేందుకు చర్చలు జరుపుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే, యుద్ధం ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో సాధారణ ఇంధన ధరలపైనా ప్రభావం పడొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు



బంగారం కొనుగోలు చేయాలనుకుంటున్న వారికి ఇదే మంచి అవకాశం. దేశీయ మార్కెట్లో పసిడి రేట్లు వరుసగా నాలుగు రోజుల పాటు భారీగా తగ్గి ఇప్పుడు అదే ధర వద్ద స్థిరంగా కొనసాగుతున్నాయి. ఈ నాలుగు రోజుల్లో స్వచ్ఛమైన బంగారం ధర తులానికి ఏకంగా రూ. 12000 వరకు దిగివచ్చింది. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం మరింత తీవ్రమవుతున్నప్పటికీ బంగారం ధరలు వరుసగా పడిపోతుండడం గమనార్హం. సాధారణంగా ఇలాంటి యుద్ధ పరిస్థితుల్లో సురక్షితమైన పెట్టుబడి మార్గంగా బంగారాన్ని ఎంచుకుంటారు. భారీగా పెట్టుబడులు పెడతారు. దీంతో ధరలు పెరుగుతాయి. కానీ, ఇప్పుడు అలా జరగడం లేదు. అమెరికా డాలర్ విలువ, బాండ్ ఈల్డ్స్ విలువ పెరగడం, ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గించకపోవడం వంటి కారణాలతో పెట్టుబడులను డాలర్ వైపు మళ్లిస్తున్నారు. దీంతో బంగారానికి గిరాకీ తగ్గి ధరలు తగ్గుతున్నాయి. ఈ క్రమంలో హైదరాబాద్ మార్కెట్లో మార్చి 23వ తేదీన 22, 24 క్యారెట్ల బంగారం, వెండి రేట్లు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.అంతర్జాతీయ మార్కెట్లో బంగారం, వెండి ధర లు కుప్పకూలుతున్నాయి. ఈరోజు స్పాట్ గోల్డ్ రేటు ఔన్సుకు ఏకంగా 144 డాలర్లు తగ్గింది. దీంతో ఔన్స్ గోల్డ్ రేటు 4428 డాలర్ల వద్దకు దిగివచ్చింది. ఇక స్పాట్ సిల్వర్ రేటు ఔన్సుకు 2.71 శాతం తగ్గింది. దీంతో ఔన్స్ వెండి ధర 67.61 డాలర్ల స్థాయిలో ట్రేడవుతోంది.హైదరాబాద్ బులియన్ మార్కెట్లో బంగారం ధరలు వరుసగా నాలుగు రోజుల పాటు తగ్గి ఈరోజు అదే ధర వద్ద స్థిరంగా కొనసాగుతున్నాయి. 24 క్యారెట్ల బంగారం రేటు గత నాలుగు రోజుల్లో 10 గ్రాములపై రూ.12000 మేర తగ్గింది. దీంతో తులం రేటు రూ. 1,45,970 వద్ద స్థిరంగా ట్రేడవుతోంది. ఇక 22 క్యారెట్ల ఆభరణాల గోల్డ్ ధర ఇవాళ ఏ మార్పు లేకుండా రూ. 1,33,800 వద్ద అమ్ముడవుతోంది.బంగారంతో పాటు వెండి రేటు సైతం స్థిరంగానే ఉంది. గత నాలుగు రోజుల్లో రూ.30 వేల మేర తగ్గిన కిలో వెండి ధర ఇవాళ ఏ మార్పు లేదు. దీంతో ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి ధర రూ.2,50,000 మార్క్ వద్ద ట్రేడవుతోంది. పైన చెప్పిన బంగారం, వెండి ధరలు మార్చి 23వ తేదీ సోమవారం రోజు ఉదయం 7 గంటలకు ఉన్నవి. అయితే బులియన్ మార్కెట్లో ధరలు మధ్యాహ్నం లోపు మారిపోతుంటాయి. కొనుగోలు చేసే వారు స్థానికంగా ఉండే ధరలను కొనే ముందు తెలుసుకోవడం మంచిది.

## వరుస హిట్స్‌కు బ్రేక్

సినిమా ఇండస్ట్రీలో జయాపజయాలు సహజం. ఒక్కోసారి భారీ అంచనాలతో వచ్చిన సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద బోల్తాకొడతాయి. అలాంటి ఓ భారీ బడ్జెట్ చిత్రం ఫెయిల్ అయినప్పుడు... ఆ సినిమాలో నటించిన హీరోయిన్ ఎప్పుడూ లేనంతగా బాధపడిందట! ఎన్నో ఆశలతో ఆ సినిమా రిజల్ట్ కోసం ఎదురుచూసిన హీరోయిన్ ఒక్కసారిగా అంచనాలు తారుమారవడంతో ఒక్కసారిగా తన కెరీర్ ప్రశ్నార్థకంగా మారిందంటూ వాపోయింది. ఇంతకీ ఎవరా హీరోయిన్? అది ఏ సినిమా? టాలీవుడ్‌లోకి ఏటా చాలామంది కొత్త హీరోయిన్లు వస్తూనే ఉన్నారు. సినీపరిశ్రమలో తెలుగు వాళ్లకంటే ముంబై, కన్నడ భామలదే హవా నడుస్తోంది. డం ఒక ఛాలెంజ్ అనే చెప్పాలి. అలాంటి పోటీని తట్టుకుని తనకంటూ ఓ ఇమేజ్ క్రియేట్ చేసుకుని స్టార్ హీరోల సరసన ఛాన్స్‌లు కొట్టేసిన ఒక స్టార్ హీరోయిన్ ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో తన మనసులో దాచుకున్న బాధను బయటపెట్టింది. తాను నటించిన ఓ సినిమా గురించి మాట్లాడుతూ 'నాకు ఎప్పుడూ లేనంత బాధ కలిగింది' అని చెప్పుకొచ్చింది. ఆ బాధ వెనుక ఉన్న కారణం... ఆ సినిమా సూపర్ స్టార్‌తో కలిసి చేసిన ప్రాజెక్ట్ కావడం, భారీ అంచనాలు కల్పించడం, కానీ ఫలితం ఊహించని విధంగా మారిపోవడం. ఆ స్టార్ హీరోయిన్ ఎవరో కాదు రకుల్ ప్రీత్ సింగ్!

